అంశం: 15

# చుట్టూ నీరు అయినా దాహం

**లక్ష్యం:**

మానవ జీవనానికి ఋతుపవనాలకు మధ్య గల సంబంధాన్ని అవగాహన చేసుకుందాం.



**నేపథ్యం:**

మానవ మనుగడకు నీరు అత్యవసరం. నీటి వనరులు క్రమంగా కనుమరుగు కావటం జీవజాలానికి పెనుముప్పు. ప్రపంచ వ్యాప్తంగా నీటి వనరుల సంరక్షణ ప్రాధాన్యత పై చర్చ జరుగుతున్నది. అటవీ ప్రాంతాలలో మానవ కార్యకలాపాలు పెరగటం, మౌళిక సదుపాయాల ప్రభావం వల్ల సమతుల్యం దెబ్బ తినటంతోపాటు వర్షాలు కువరటంలోనూ క్రమం తప్పింది. కొన్ని ప్రాంతాల్లో వర్షాకాలంలో అధిక వర్షపాతం వల్ల ప్రజల సాధారణ జీవనం స్తంభించడంతోపాటు, పశువులు కూడా తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. 2006 సంవత్సరంలో థార్ ఎడారిలో అసాధారణ వర్షం కురవడం వలన పెద్ద మొత్తంలో ప్రాణ, ఆస్థి నష్టాలు జరిగాయి.



**పద్ధతి:**

1. మీ పెద్దవారిని గాని, వాతావరణశాఖ కార్యాలయాన్ని గాని సంప్రదించి గత పది సంవత్సరాలలో కురిసిన వర్షపాత వివరాలను సేకరించండి.
2. గతంలో ఎప్పుడైనా వరదలు, కరువు సంభవించాయేమో కనుక్కోండి.
3. వాటి ప్రభావం ప్రజల జీవితాలపై ఎలా వుంటుందో కనుక్కోండి.
4. ఒక సంవత్సరంలో అధిక, అల్ప వర్షాలు కురవడానికి గల కారణాలను విశ్లేషించండి.

**ముగింపు:**

కరువులు, వరదలు మొదలైనవన్నీ మానవ తప్పిదాల వల్ల కలుగుతున్నాయి. కాలువలు, చెరువులు, ఆక్రమణలకు గురికావడం వల్ల, నదీ ప్రవాహాలు దారిమళ్ళి వరదలకు కారణమవుతున్నాయి. విచక్షణా రహితంగా చెట్లు నరికి వేయడం, వర్షపునీటిని నేలలోకి ఇంకేలా చేయడానికి ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం వల్ల వర్షాలు తగ్గి కరువుకాటకాలు ఎక్కువవుతున్నాయి. మనకున్న పాలన వ్యవస్థల మధ్య సమన్వయలోపాలు పర్యావరణానికి తీవ్రవిఘాతం కలిగిస్తున్నాయి. ఒకవైపు చెట్లు పెంచుతాం మరోవైపు కరెంటు తీగలకు అడ్డొస్తున్నాయని వాటిని నరికివేస్తాం. రోడ్లు విస్తరించాల్సి వస్తోందని ఎన్నో ఏళ్ళనాటి వృక్షాలను కూలగొట్టి వాటి బదులుగా గన్నేరు మొక్కలో, కాగితాలపూల మొక్కలనో పెంచి సరిపెట్టుకుంటాం. ఈ మధ్యకాలంలో పెద్దపెద్ద వృక్షాలను సైతం వేళ్ళతో పెకలించి మరొకచోట నాటే సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడం వల్ల ప్రస్తుతం చెట్లను రక్షించుకోగలుగుతున్నాం. కానీ ఇది ఇంకా ప్రాచుర్యంలోకి రావలసిన అవసరం ఉంది. అన్నిరకాల పర్యావరణ సమస్యలకు ఏకైక పరిష్కారం చెట్లను పెంచడమే.

మీ అధ్యయనం ఆధారంగా చిత్రాలను పొందుపరుస్తూ నివేదిక రాయండి.

**తదుపరి చర్యలు:**

1. పట్టణాలు, నగరాలలో వరదలకు కారణాలు గుర్తించి వాటిని నివారించడానికి సూచనలు చేయండి.
2. నదులు, కాలువలు అందుబాటులో ఉన్నప్పటికీ తాగడానికి నీరు లేకపోవడానికి కారణాలు ఏమిటని మీరు భావిస్తున్నారు.



భారతదేశంలో 1/5 వంతు (200 మిలియన్ల ప్రజలు) జనాభాకు సురక్షితమైన తాగునీరు అందుబాటులో లేదు. 600 మిలియన్ల ప్రజలకు అవసరమైన పారిశుధ్య సౌకర్యాలు లేవు.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ